నైట్‌బజార్ ఏమాయె..?


లాడ్‌బజార్‌లోని గాజుల దుకాణాల సముదాయం

చార్మినార్: పాతబస్తీలోని లాడ్‌బజార్‌ను నైట్ బజార్‌గా మారుస్తామని చేసిన ప్రతిపాదనలు కాగితాలకే పరిమితమయ్యాయని స్థానిక గాజుల వ్యాపారులు ఆవేదన వ్యక్తం చేస్తున్నారు. ప్రజా ప్రతినిధులు, సంబంధిత అధికారులు నైట్ బజార్ విషయాన్ని పట్టించుకోవడం లేదని వ్యాపారులు అంటున్నారు. 1999లో అప్పటి ప్రభుత్వం ప్రకటించిన విధంగా లాడ్‌బజార్‌ను నైట్ బజార్‌గా తీర్చిదిద్దాలని వ్యాపారస్తులు కోరుతున్నారు.

- 1999లో అప్పటి ప్రభుత్వం చేసిన ప్రతిపాదనలు..గాలికి
- లాడ్‌బజార్ వ్యాపారాభివృద్ధికి కృషి చేయాలంటున్న వ్యాపారులు

లాడ్‌బజార్ అంటే..

- లాడ్లా అంటే గారాబం.. ప్రేమ..అనురాగం.
- ఉర్దూ భాషలో తమకు ఇష్టమైన వారిని ముఖ్యంగా చిన్నారులను లాడ్లా అని సంబోధిస్తుంటారు.
- తమ ప్రేమకు, అభిమానానికి గుర్తుగా ఇక్కడ నుంచి కానుకను కొని బహూకరిస్తుండటం వల్ల దీనికి ఈ పేరు వచ్చిందని భావిస్తున్నారు.
- మహ్మద్ కులీ కుతుబ్‌షా కూడా తాను ప్రేమించిన భాగమతికి ఇక్కడి లాడ్‌బజార్‌లోని గాజులనే బహుమతిగా ఇచ్చారని పెద్దలు అంటారు.

- ప్రస్తుతం లాడ్‌బజార్‌లో దాదాపు 250కి పైగా దుకాణాలు నిత్యం తమ వ్యాపార లావాదేవీలు కొనసాగిస్తున్నాయి.

వాహనాల అనుమతి లేకపోవడంతో..

- ప్రస్తుతం లాడ్‌బజార్ వరకు వాహనాల అనుమతి లేకపోవడంతో కొంత మేరకు వ్యాపారం కుంటుపడుతోందంటున్నారు.
- లాడ్‌బజార్ దుకాణాలలో రోజుకు సగటున పదివేల నుంచి ఇరవై వేల వరకు కొనుగోళ్లు ఉంటాయి.

ప్రత్యేక సౌకర్యాలు కల్పించాలి..

- దూరపు ప్రాంతాల నుంచి షాపింగ్ కోసం ఇక్కడికి వచ్చే వినియోగదారులకు సరైన పార్కింగ్ సౌకర్యం ఏర్పాటు చేయాలి.
- పార్కింగ్ లేకపోవడంతో తమ వాహనాలను ఎక్కడ పార్కు చేసుకోవాలో తెలియక వినియోగదారులు ఇబ్బందులకు గురవుతున్నారు.
- మల్టీ లెవల్ పార్కింగ్ కాంప్లెక్స్‌ను వెంటనే నిర్మించి తగిన ఏర్పాట్లు చేయాలి.
- చార్మినార్ ఇన్నర్ రింగ్ రోడ్డు, అవుటర్ రింగ్ రోడ్డులను పూర్తిగా అందుబాటులోకి తేవాలి.
- ప్రపంచ పర్యాటకుల వ్యాపార స్థలమైన లాడ్‌బజార్‌లో వ్యాపారాభివృద్ధికి ఇక్కడి దుకాణాలకు విద్యుత్ బిల్లుల్లో రాయితీ కల్పించాలని వ్యాపారులు కోరుతున్నారు.

లాడ్‌బజార్ గాజుల విక్రయాలకు పెట్టింది పేరు..

- ప్రపంచ పర్యాటక స్థలమైన చార్మినార్ కట్టడం వద్ద ఉన్న లాడ్‌బజార్ గాజుల విక్రయాలకు పెట్టింది పేరు.
- ఇక్కడి గాజులకు ప్రపంచ గుర్తింపు ఉంది. చార్మినార్ నీడలో నిజాం కాలం నుంచి లాడ్‌బజార్ కొనసాగుతోంది.
- సహజ సిద్ధంగా లభించే మట్టి గాజులతో పాటు గోట్లు, మెటల్, డైమండ్స్, సీసం, బ్రాస్, ఫైబర్, మిర్రర్, ఎనామిల్ తదితర ఫ్యాషన్ గాజులు ఇక్కడ లభిస్తాయి.
- వీటిలో రోజువారీ వాడకానికి, పార్టీవేర్‌కూ రకరకాల గాజులు లాడ్‌బజార్‌లో దొరుకుతాయి.
- కొనుగోలు దారులతో నిత్యం కళకళలాడే లాడ్‌బజార్‌లో సరసమైన ధరలకు నాణ్యమైన గాజులు అందుబాటులో ఉంటాయి.

శ్యాంరావు ముదిరాజ్‌కు మదర్ థెరిస్సా అవార్డు

చార్మినార్: 20 ఏళ్లకు పైగా సామాజిక సేవా కార్యక్రమాల్లో చురుకుగా పాల్గొంటున్న ప్రముఖ సంఘ సేవలకుడు, టీపీసీసీ ఓబీసీ సెల్ గ్రేటర్ హైదరాబాద్ ఉపాధ్యక్షుడు, తెలంగాణ రాష్ట్ర ఆటో అండ్ ట్రాన్స్‌పోర్టు డ్రైవర్స్ యూనియన్ గ్రేటర్ హైదరాబాద్ కార్యనిర్వాహక కార్యదర్శి కాశమ్యోని శ్యాంరావు ముదిరాజ్‌కు మదర్ థెరిస్సా స్మారక అవార్డు-2023 వచ్చింది. తెలంగాణ సిటిజన్ కౌన్సిల్ ఆధ్వర్యంలో బషీర్‌బాగ్‌లోని ప్రెస్‌క్లబ్‌లో తెలంగాణ శాసనమండలి డిప్యూటీ చైర్మన్ డాక్టర్ బండ ప్రకాశ్ చేతుల మీదుగా ఆయన ఈ అవార్డును అందుకున్నారు. ఈ కార్యక్రమంలో తెలంగాణ సిటిజన్స్ కౌన్సిల్ అధ్యక్షుడు డాక్టర్ రాజ్‌నారాయణ్ ముదిరాజ్ పాల్గొన్నారు.


అవార్డును అందుకున్న శ్యాంరావు ముదిరాజ్

ట్రాఫిక్ నిబంధనలు పాటించాలి


విద్యార్థులకు అవగాహన కల్పిస్తున్న ఏసీపీ శంకర్ రాజు

విజయనగర్‌కాలనీ: ట్రాఫిక్ నిబంధనలను ప్రతి ఒక్కరూ పాటించాలని బేగంపేట్ ట్రాఫిక్ ట్రైనింగ్ ఇనిస్టిట్యూట్ ఏసీపీ జి.శంకర్ రాజు అన్నారు. మాసబ్‌ట్యాంక్ జవహర్‌లాల్ నెహ్రూ ఆర్కిటెక్చర్ అండ్ ఫైనార్ట్స్ యూనివర్సిటీ ప్రాంగణంలోని ఆడిటోరియం హాల్‌లో శుక్రవారం ఆసిఫ్‌నగర్ ట్రాఫిక్ పోలీస్‌స్టేషన్ ఇన్‌స్పెక్టర్ బాలకృష్ణగౌడ్ ఆధ్వర్యంలో ట్రాఫిక్ చట్టాలపై విద్యార్థులతో పవర్ పాయింట్ ప్రజంటేషన్ ద్వారా అవగాహన కల్పించారు. ఈ సందర్భంగా ఏసీపీ మాట్లాడుతూ.. రాంగ్‌రూట్, సెల్‌ఫోన్ డ్రైవింగ్, ట్రిపుల్ రైడింగ్, జీబ్రా క్రాసింగ్ వద్ద వెళ్తున్నప్పుడు వాహనదారులు విధిగా ట్రాఫిక్ రూల్స్‌ను పాటించాలన్నారు. స్కూల్ ఆఫ్ ప్లానింగ్ అండ్ ఆర్కిటెక్చర్ కళాశాల ప్రిన్సిపాల్ ప్రొఫెసర్ సీహెచ్. శ్రీనివాస్, ప్రొఫెసర్ వినోద్ గణేష్‌లతో పాటు యూనివర్సిటీ బోధన, బోధనేతర సిబ్బంది పాల్గొన్నారు.

అన్ని వర్గాల అభ్యున్నతికి కృషి

జియాగూడ: సీఎం కేసీఆర్ అన్ని వర్గాల అభ్యున్నతికి కృషి చేస్తున్నారని కార్వాన్ బీఆర్ఎస్ అభ్యర్థి మిత్రకృష్ణ అన్నారు. శుక్రవారం జియాగూడ సంజయ్‌నగర్‌లోని సంత్ రవిదాస్ భవనంలో సంత్ రవి దాస్ మోచి సమాజ్ సేవా సంఘం అధ్యక్షుడు మహేష్కర్ కాంతి లాల్ ఆయనను సన్మానించారు. అనంతరం కాంతీలాల్ మాట్లాడుతూ.. సంజయ్‌నగర్ మోచి సమాజ్ వారికి గృహలక్ష్మి పథకం, దళిత బంధు అమలు చేయాలని కోరారు. మిత్రకృష్ణ మాట్లాడుతూ..ఎస్సీ కులాల వారితో పాటు అన్ని కులాలకు సీఎం కేసీఆర్ ఆర్థిక సంక్షేమ పథకాలు అందజేస్తున్నారన్నారు. మోచి సమాజ్ కులాస్తులకు ప్రభుత్వ పథకాలు వెంటనే అందేందుకు తనవంతు సహకారం అందిస్తామన్నారు. ఈ కార్యక్రమంలో సమాజ్ సభ్యులు మనోహర్ మాహోరే, వినోద్ దయాల్, ముఖేష్ మాహోరే, నర్సింగ్ పర్వారే, బీఆర్ఎస్ నాయకుడు ఉమేష్ మహేష్కర్, గణేష్, అభిషేక్ మిత్ర, గణేష్ దేవికర్ పాల్గొన్నారు.


మిత్రకృష్ణను సన్మానిస్తున్న మోచి సమాజ్ అధ్యక్షుడు మహేష్కర్ కాంతిలాల్, ఉమేష్

ఘనంగా భాషా నిలయం వ్యవస్థాపక దినోత్సవం


నాళేశ్వరం శంకరానికి పురస్కారాన్ని ప్రదానం చేస్తున్న రమణాచారి తదితరులు

సుల్తాన్‌బజార్: శ్రీకృష్ణ దేవరాయ తెలుగు భాషా నిలయం వ్యవస్థాపక దినోత్సవాలు శుక్రవారం సాయంత్రం సుల్తాన్‌బజార్‌లోని భాషా నిలయంలో ఘనంగా జరిగాయి. ఈ సందర్భంగా రావిచెట్టు లక్ష్మీనర్సమ్మ స్మారక పురస్కారాన్ని కవయిత్రి చక్రవర్తుల లక్ష్మీనర్సమ్మకు ప్రదానం చేశారు. అదేవిధంగా మహాకవి దాశరథి కృష్ణమాచార్య సాహితీ పురస్కారాన్ని తెలంగాణ ప్రభుత్వ సలహాదారు డాక్టర్ కేవీ రమణాచారి కవి డాక్టర్ నాళేశ్వరం శంకరానికి ప్రదానం చేశారు. ఈ సందర్భంగా నిర్వహించిన విద్యార్థుల వ్యాసరచన పోటీల్లో విజేతలకు బహుమతుల ప్రదానం చేశారు. అనంతరం రమణాచారి మాట్లాడుతూ.. శ్రీకృష్ణ దేవారాయ తెలుగు భాషా నిలయం ఎంతో సాహితీ చరిత్ర ఉందన్నారు. భాషా నిలయం అధ్యక్షుడు నూతి శంకర్‌రావు, గౌరవ కార్యదర్శి ఉదయవర్లు, చంద్రప్రకాష్ రావు తదితరులు పాల్గొన్నారు.

బీఆర్ఎస్ హయాంలోనే మహిళా సంక్షేమం

అబిడ్స్: బీఆర్ఎస్ ప్రభుత్వ హయాంలోనే మహిళా సంక్షేమం పెద్ద ఎత్తున్న కొనసాగుతుందని గోషామహల్ నియోజకవర్గం బీఆర్ఎస్ ఇన్‌చార్జ్ నందకిశోర్ వ్యాస్ బిలాల్ పేర్కొన్నారు. మహిళాలోకానికి అన్ని విధాల అండదండలు అందించి వారి అభివృద్ధికి కృషి చేసిన ఘనత కేసీఆర్‌కే దక్కుతుందన్నారు. బేగంబజార్ శృంగ్‌రుషి భవన్‌లో పెద్ద ఎత్తున రక్షాబంధన్ వేడుకలు నిర్వహించారు. ఈ సందర్భంగా మహిళలకు చీరలు పంపిణీ చేశారు. అనంతరం నందకిశోర్ వ్యాస్ బిలాల్ మాట్లాడుతూ.. ఆదిత్య శ్రీకృష్ణ చారిటబుల్ ట్రస్టు తరఫున 26 ఏళ్లుగా గోషామహల్ నియోజకవర్గ ప్రజలకు పలు విధాల సేవలందిస్తున్నానన్నారు. ఈ కార్యక్రమంలో పూజా వ్యాస్ బిలాల్, అనిత, వనిత, శంకర్‌సింగ్ జమేదార్, పుష్ప, సంతోషి పాల్గొన్నారు.


మహిళలకు చీరలు పంపిణీ చేస్తున్న నందకిశోర్ వ్యాస్ బిలాల్

'బీఆర్ఎస్ ప్రభుత్వం నిరుద్యోగులను మోసం చేస్తోంది'


గౌరీ సతీష్

అబిడ్స్: మెగా డీఎస్సీ ప్రకటించామని అబద్దాలు చెబుతూ బీఆర్ఎస్ ప్రభుత్వం నిరుద్యోగులను మోసం చేస్తోందని టీపీసీసీ అధికార ప్రతినిధి గౌరీ సతీష్ పేర్కొన్నారు. అసెంబ్లీ సాక్షిగా సీఎం కేసీఆర్, విద్యాశాఖ మంత్రి సబితా ఇంద్రారెడ్డి వేలాది మందికి డీఎస్సీ ఇస్తామని ప్రకటించారన్నారు. వాళ్ల ప్రకటనలకు పొంతన లేకుండా పోయిందన్నారు. శుక్రవారం ఆయన విలేకర్లతో మాట్లాడుతూ.. తెలంగాణ రాష్ట్రం నలుమూలలా నిరుద్యోగులకు నిరుద్యోగభృతి కల్పిస్తామని చెప్పిన ప్రభుత్వం ఇంత వరకు ఎందుకు ప్రారంభించలేదన్నారు. 5 సంవత్సరాల నిరుద్యోగ భృతిని నిరుద్యోగులకు అందరికీ ఇవ్వాలని గౌరీ సతీష్ డిమాండ్ చేశారు.

న్యూసెన్స్ కేసులో వ్యక్తికి జైలు

డబీర్‌పురా: గంజాయి, వైట్నర్ మత్తులో కుటుంబ సభ్యులను వేధిస్తున్న ఓ వ్యక్తికి నాంపల్లిలోని 6వ స్పెషల్ మెట్రోపాలిటన్ మెజిస్ట్రేట్ ఎస్.లక్ష్మణ్‌రావు 3 రోజుల జైలు శిక్ష విధిస్తూ తీర్పునిచ్చారు. రెయిన్ బజార్ ఇన్‌స్పెక్టర్ ఎ.మధుసూదన్ తెలిపిన వివరాల ప్రకారం.. యాకుత్‌పురా ఆమన్‌నగర్‌కు చెందిన వహాబ్ ఖాన్ గంజాయి, వైట్నర్ మత్తులో కుటుంబసభ్యులతో పాటు స్థానికంగా ఉండే ఇరుగు, పొరుగు వారిని ఇబ్బందులకు గురి చేస్తున్నాడు. కుటుంబసభ్యుల ఫిర్యాదు మేరకు పోలీసులు వహాబ్‌పై కేసు నమోదు చేసి శుక్రవారం నాంపల్లిలోని 6వ స్పెషల్ మెట్రో పాలిటన్ కోర్టులో హాజరుపరచగా మెజిస్ట్రేట్ ఎస్.లక్ష్మణ్‌రావు నిందితుడికి 3రోజుల జైలు శిక్ష విధిస్తూ తీర్పునిచ్చారు.

సెక్యూరిటీగార్డుపై దాడి చేసిన వ్యక్తికి..

నాంపల్లి: తాగిన మైకంలో నిలోఫర్ ఆస్పత్రి సెక్యూరిటీ గార్డుపై దాడి చేసిన ఓ వ్యక్తికి న్యాయస్థానం 10 రోజుల జైలు శిక్ష విధించింది. ఈ ఘటన నాంపల్లి పోలీస్‌స్టేషన్ పరిధిలో చోటుచేసుకుంది. ఇన్‌స్పెక్టర్ అభిలాష్ తెలిపిన వివరాల ప్రకారం.. మాసబ్‌ట్యాంక్ ఫస్టలాన్సర్ ప్రాంతానికి చెందిన మహ్మద్ ముక్తార్ బేగ్(43) ప్రైవేట్ ఉద్యోగి. బుధవారం చికిత్స నిమిత్తం తన కుమారుడిని తీసుకుని నిలోఫర్‌కి వచ్చారు. లోపలికి వెళ్లడానికి సెక్యూరిటీ సిబ్బంది నిరాకరించడంతో ఇద్దరి మధ్య తీవ్ర వాగ్వాదం చోటుచేసుకుంది. మద్యం సేవించి ఉన్న మహ్మద్ ముక్తార్ బేగ్ సెక్యూరిటీ గార్డు సుధాకర్‌పై దాడి చేశారు. సెక్యూరిటీగార్డు నాంపల్లి పోలీసులను ఆశ్రయించి దాడి చేసిన వ్యక్తిపై చర్యలు తీసుకోవాలని ఫిర్యాదు చేశారు. కేసు నమోదు చేసుకున్న పోలీసులు శుక్రవారం నిందితుడిని కోర్టు ఎదుట హాజరు పరుచగా 11వ స్పెషల్ ఎంఎం కోర్టు న్యాయమూర్తి లక్ష్మణరావు నిందితుడికి 10రోజుల జైలు శిక్ష విధించినట్లు ఇన్‌స్పెక్టర్ అభిలాష్ తెలిపారు.

హాని కలిగించే చమురు కేంద్రాన్ని నిర్వహిస్తున్న వ్యక్తికి శిక్ష

సంతోష్‌నగర్: ఆరోగ్యానికి హాని కలిగించే చమురు కేంద్రాన్ని నిర్వహిస్తున్న కేసులో ఓ వ్యక్తికి నాంపల్లిలోని 7వ ఏసీఎంఎం కోర్టు మెజిస్ట్రేట్ బి.సౌజన్య ఏడాది కఠిన కారాగార శిక్ష, రూ.7,700ల జరిమానా విధిస్తూ తీర్పునిచ్చారు. సంతోష్‌నగర్ ఇన్‌స్పెక్టర్ శివచంద్ర తెలిపిన వివరాల ప్రకారం.. అరుంధతి కాలనీ ప్రాంతానికి చెందిన మహ్మద్ అహ్మద్ (51), మహ్మద్ అల్తాఫ్ (20)లు ప్రజల ఆరోగ్యానికి హాని కలిగించే విధంగా పశువుల కొవ్వు, ఎముకలను కరిగించే చమురు కేంద్రాన్ని నిర్వహిస్తుండగా... వారిని 2015 జనవరి 10న సంతోష్‌నగర్ పోలీసులు అరెస్ట్ చేసి నమోదు చేశారు. ఇప్పటికే ఈ కేసులో మహ్మద్ అహ్మద్ చనిపోగా... మహ్మద్ అల్తాఫ్‌ను శుక్రవారం నాంపల్లిలోని 7వ ఏసీఎంఎం కోర్టులో హాజరుపరచగా... పూర్వ పరాలను పరిశీలించిన మెజిస్ట్రేట్ సౌజన్య అల్తాఫ్‌కు ఏడాది కఠిన కారాగార శిక్ష, రూ.7,700ల జరిమానా విధిస్తూ తీర్పునిచ్చారు.

పురాతన కట్టడాలకు పునర్ వైభవం కల్పిస్తాం

చార్మినార్: పాతబస్తీలో పురాతన కట్టడాలకు పునర్ వైభవం కల్పించేందుకు ప్రభుత్వం చర్యలు తీసుకుంటుందని జీహెచ్‌ఎంసీ కమిషనర్ రోనాల్డ్ రోస్ అన్నారు. శుక్రవారం కమిషనర్ సీసీపీ రాజేంద్రప్రసాద్ నాయక్, కులీ కుతుబ్ షా అర్బన్ డెవలప్‌మెంట్ అథారిటీ సెక్రటరీ శంకర్‌లాల్, సీఈ గురువీర, ఈఈ శంకర్, జోనల్ కమిషనర్ వెంకన్నతో కలిసి పలు పురాతన కట్టడాలకు ప్రతిపాదించిన పనులను కమిషనర్ పరిశీలించారు. ముందుగా కమిషనర్ దారుషిఫా (ఓల్డ్ ఎంసీహెచ్ ఆఫీస్) సర్దార్ మహల్, చార్మినార్ ఓల్డ్ బస్టాండ్, ముర్గీచౌక్, ఖుర్షీద్ ఝా దేవిడి, సాలార్‌జంగ్ మ్యూజియం ఎదురుగా ఐకాన్ బ్రిడ్జి నిర్మాణం చేపట్టే స్థలాన్ని పరిశీలించారు. ఒక్కొకటి రూ.30 కోట్లతో చేపట్టే ముర్గీచౌక్, సర్దార్ మహల్ పునరుద్ధరణ పనులను యుద్ధప్రతిపాదికన పూర్తి చేయాలని ఆదేశించారు. చార్మినార్ ఓల్డ్ బస్టాండ్ అభివృద్ధికి బీఓటీ పద్ధతిపై నిర్మాణానికి చర్యలు తీసుకోవాలని అధికారులను ఆదేశించారు. ఖుర్షీద్ ఝా దేవిడి రూ.12 కోట్ల అంచనాతో చేపట్టనున్న పనులకు టెండర్ ప్రక్రియను పూర్తి చేయాలని ఆదేశించారు. సాలార్‌జంగ్ మ్యూజియం వద్ద రెండు వైపుల రూ.40 కోట్ల అంచనా వ్యయంతో ఐకాన్ బ్రిడ్జి చేపట్టనున్నారని తెలిపారు.


మీరాలంమండిలో పురాతన కట్టడాలను పరిశీలిస్తున్న జీహెచ్‌ఎంసీ కమిషనర్ రోనాల్డ్ రోస్

భారీ మెజార్టీతో గెలుస్తాం: వినోద్‌కుమార్


ప్లానింగ్ కమిషన్ వైస్ చైర్మన్‌కు పుష్పగుచ్ఛం అందిస్తున్న వహీద్ అహ్మద్

గోల్కొండ: వచ్చే అసెంబ్లీ ఎన్నికల్లో బీఆర్ఎస్ భారీ మెజార్టీతో గెలుస్తుందని తెలంగాణ రాష్ట్ర ప్లానింగ్ కమిషన్ వైస్ చైర్మన్ బి.వినోద్‌కుమార్ అన్నారు. సీఎం కేసీఆర్ మైనార్టీలకు లక్షలాది రూపాయల రుణాలు ఇవ్వడంతో పాటు నిరుపేదలకు డబుల్ బెడ్‌రూమ్‌లు ఇస్తున్న సందర్భాన్ని పురస్కరించుకొని శుక్రవారం రాష్ట్ర వక్ఫ్‌బోర్డు మాజీ సభ్యుడు వహీద్ అహ్మద్ శుక్రవారం ఆయనను కలిశారు. ఈ సందర్భంగా ఆయనకు పుష్పగుచ్ఛం అందించారు. ఈ సందర్భంగా బి.వినోద్‌కుమార్ మాట్లాడుతూ.. సీఎం కేసీఆర్‌లాంటి గొప్ప వ్యక్తిత్వం ఉన్న సీఎం మరేరాష్ట్రానికి లేరని, ప్రజా సంక్షేమం కోసం కేసీఆర్ చేపట్టిన సంక్షేమ పథకాలు మరేరాష్ట్రంలో లేవని ఆయన అన్నారు. మంత్రి కేటీఆర్ చొరవ వల్ల రాష్ట్రంలో పరిశ్రమలు బాగా పెరిగి నిరుద్యోగులకు ఉపాధి లభించిందని ఆయన అన్నారు. ముచ్చటగా మూడవ సారి కేసీఆర్ మళ్లీ ముఖ్యమంత్రి కాబోతున్నారన్నారు. మైనార్టీ ఫైనాన్స్ కార్పొరేషన్ మాజీ చైర్మన్ సయ్యద్ అక్బర్ హుస్సేన్ తదితరులున్నారు.

పార్కుల్లో పచ్చదనాన్ని పెంచాలి

గోల్కొండ: పార్కుల్లో పచ్చదనాన్ని పెంచాల్సిన బాధ్యత స్థానికులపై ఉందని ఎమ్మెల్యే కౌసర్ మొహియుద్దీన్ అన్నారు. శుక్రవారం ఆయన నానల్‌నగర్ డివిజన్ హకీంపేట్ కుంటలోని పార్కులో మొక్కలు నాటారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ.. ఈ పార్కు ఇతర పార్కులకు ఆదర్శంగా నిలవాలన్నదే తన అభిమతమన్నారు. హకీంపేట్ పరిసరాల్లో బస్తీలకు ఇదొక్కటే పార్కు అని ఈ పార్కును ప్రతి ఒక్కరూ సద్వినియోగం చేసుకోవాలని ఆయన కోరారు. వివిధ రకాల మొక్కలతో పాటు ఔషధ మొక్కలను కూడా ఇక్కడ నాటామన్నారు. ఈ పార్కును మరింత అభివృద్ధి చేసేందుకు తాను బల్దియా ఉద్యాన శాఖ అధికారులతో మాట్లాడుతానని ఆయన అన్నారు. తమ ప్రాంతంలోని పాఠశాలల విద్యార్థులు సైతం పార్కును సందర్శించేలా బస్తీ, కాలనీ వాసులు ప్రత్యేక ఏర్పాట్లు చేయాలని ఆయన సూచించారు.


మొక్కలు నాటుతున్న ఎమ్మెల్యే కౌసర్

సన్మానం


తాతయ్య, నానమ్మలను సన్మానిస్తున్న దృశ్యం

గోల్కొండ: నేటి పిల్లలే రేపటి పౌరులని జగదాంబిక మహంకాళీ అమ్మవారి వృత్తి పని వారి సంఘం అధ్యక్షుడు బొమ్మల సాయిబాబాచారి అన్నారు. శుక్రవారం గోల్కొండ రిసాలబజార్, పాత శివాలయం వద్ద తాతయ్య, నానమ్మల సన్మాన కార్యక్రమం జరిగింది. ఈ సందర్భంగా పలువురు చిన్నారులు సాయిబాబాచారి దంపతులను ఘనంగా సన్మానించారు. ఈ కార్యక్రమంలో శ్రీకాంత్‌చారి, శ్రీనివాస్, సురేష్‌చారి తదితరులున్నారు.

ఉమ్రా యాత్ర పవిత్రమైనది

గోల్కొండ: ఉమ్రా యాత్ర ఎంతో పవిత్రమైనదని తెలంగాణ ఫ్యామిలీ కౌన్సిలింగ్ ఆర్గనైజేషన్ రాష్ట్ర చైర్మన్ మహ్మద్ నజీబ్ అన్నారు. ఉమ్రా యాత్రకు శుక్రవారం బయలుదేరి వెళ్లిన మిర్ తౌఫిక్ ఆలీని శుక్రవారం గోల్కొండ రిసాలబజార్‌లో ఘనంగా సన్మానించి వీడ్కోలు పలికారు. ఈ సందర్భంగా మహ్మద్ నజీబ్ మాట్లాడుతూ.. ఉమ్రా యాత్రకు వెళ్లాలనేది ప్రతి ముస్లిం కోరిక అని అయితే కొందరికి మాత్రమే ఈ అవకాశం దేవుడు ఇస్తాడన్నారు. ఈ కార్యక్రమంలో మహ్మద్‌ఖదీర్, ఖాజాభాయ్ తదితరులున్నారు.


మీర్ తౌఫిక్ ఆలీని సన్మానిస్తున్న దృశ్యం

బీసీ రుణాలను పంపిణీ చేయాలి


ధర్నా నిర్వహిస్తున్న బీజేపీ నేతలు

యాకుత్‌పురా: బీసీ రుణలను వెంటనే అందజేయాలని కోరుతూ బీజేపీ నాయకుల ఆధ్వర్యంలో శుక్రవారం డబీర్‌పురాలోని చార్మినార్ తహసీల్దార్ కార్యాలయం ఎదుట ధర్న నిర్వహించారు. నాయకులు, కార్యకర్తలు కార్యాలయం ముందు బైఠాయించి పెద్ద ఎత్తున్న నిరసన వ్యక్తం చేశారు. అనంతరం నాయకులు తహసీల్దార్ నిహారికను కలిసి బీసీ రుణల కోసం దరఖాస్తు చేసుకున్న వారికి ఇప్పటి వరకు ఎలాంటి సమాచారం రాలేదు.. నిజమైన లబ్దిదారులను గుర్తించి రుణలు మంజూరు చేయాలని తహసీల్దార్ దృష్టికి తీసుకెళ్లారు. దీనిపై సానుకూలంగా స్పందించిన ఆమె ఉన్నతాధికారులకు వివరిస్తానని హామీ ఇచ్చారని బీజేవైఎం యాకుత్‌పురా అసెంబ్లీ కన్వీనర్ ఈశ్వర్ యాదవ్ తెలిపారు. ఈ ధర్నాలో బీజేపీ నాయకులు అర్వింద్ చారి, వివేక్, అభిషేక్ తదితరులు పాల్గొన్నారు.

ఐఎస్‌సదన్‌లో కార్డన్ సెర్చ్

సంతోష్‌నగర్: ప్రజలకు పోలీసు సేవలను మరింత చేరువ చేయడానికి కార్డన్ సెర్చ్‌ను నిర్వహిస్తున్నామని సౌత్, ఈస్ట్ జోన్ డీసీపీ సీహెచ్.రూపేశ్ అన్నారు. ఐ.ఎస్.సదన్ పోలీస్‌స్టేషన్ పరిధిలోని సంతోష్‌నగర్ కాలనీలో శుక్రవారం రాత్రి పోలీసులు కార్డన్ సెర్చ్ నిర్వహించారు. ఈ కార్డన్ సెర్చ్‌లో దాదాపు 200 మంది పోలీసు అధికారులు, సిబ్బంది పాల్గొని 31 ద్విచక్ర వాహనాలు, 2 ఫోర్ విల్లర్ వాహనాలు, 5 మంది రౌడీషీటర్లు, 2 అనుమానితులను అదుపులోకి తీసుకున్నారు. ఈ సందర్భంగా సౌత్, ఈస్ట్ జోన్ డీసీపీ సీహెచ్.రూపేశ్ మాట్లాడుతూ.. ఈ కార్డన్ సెర్చ్‌లో పలు వాహనాలను స్వాధీనం చేసుకోవడం జరిగిందని.. ఈ వాహనాలకు సంబంధించిన సరైన పత్రాలు తీసుకొచ్చి తీసుకెళ్లాలన్నారు. నగర పోలీసు కమిషనర్ సీవీ ఆనంద్ ఆదేశాల మేరకు ఆపరేషన్ కార్డన్ క్లీనింగ్ ఆఫ్ డార్క్ ఏరియాస్ అట్ నైట్ కార్యక్రమాలను నిర్వహిస్తున్నామన్నారు. అడిషనల్ డీసీపీ మనోహర్, సంతోష్‌నగర్ ఏసీపీ మహ్మద్ గౌస్, ఐ.ఎస్.సదన్ ఇన్‌స్పెక్టర్ ఎస్.మల్లేష్, ఎస్సైలు, సిబ్బంది పాల్గొన్నారు.

ఉద్యోగులకు అండగా టీఎన్జీఓస్ యూనియన్



అబిడ్స్: ఉద్యోగులకు అండగా టీఎన్జీఓస్ యూనియన్ కృషి చేస్తుందని యూనియన్ హైదరాబాద్ జిల్లా అధ్యక్షుడు డాక్టర్ ఎస్ఎం.ముజీబ్ హుస్సేని పేర్కొన్నారు. పలు ప్రభుత్వ శాఖల్లో ఉద్యోగుల సమస్యలను ఎప్పటికప్పుడు ప్రభుత్వం దృష్టికి తీసుకువెళ్లి పరిష్కరిస్తున్నట్లు వివరించారు. టీఎన్జీఓస్ మహిళా ఉద్యోగులు జానకి, సుజాత, గీతా సింగ్‌లతో పాటు పలువురు మహిళలు డాక్టర్ ఎస్ఎం ముజీబ్ హుస్సేన్‌కు రక్షాబంధన్ శుభాకాంక్షలు తెలిపారు. కేఆర్.రాజ్‌కుమార్, విక్రమ్‌కుమార్, ఉమర్‌ఖాన్, మహ్మద్ అబ్దుల్ వహీద్, ముస్తఫా షరీఫ్ పాల్గొన్నారు.

క్లుప్తంగా...

గోషామహల్ అభివృద్ధికి కృషి


మంత్రిని సత్కరిస్తున్న ఆనంద్‌కుమార్‌గౌడ్

అబిడ్స్: గోషామహల్ నియోజకవర్గ అభివృద్ధికి ప్రత్యేక కృషి చేస్తున్నట్లు మంత్రి తలసాని శ్రీనివాస్‌యాదవ్ పేర్కొన్నారు. నియోజకవర్గం బీఆర్ఎస్ నాయకుడు ఎం.ఆనంద్‌కుమార్‌గౌడ్ ఆధ్వర్యంలో మంత్రి తలసానిని కలిసి ధూల్‌పేట్‌తో పాటు ప్రాంతాల్లో ఉన్న సమస్యలను మంత్రికి వివరించారు. ఈ సందర్భంగా మంత్రి తలసాని మాట్లాడుతూ..నియోజకవర్గంలో బీఆర్ఎస్ హయాంలోనే కోట్ల రూపాయాల అభివృద్ధి పనులు చేపట్టామన్నారు. ధూల్‌పేట్‌తో పాటు అన్ని ప్రాంతాల సమస్యలను వెంటనే పరిష్కరిస్తామని హామీ ఇచ్చారు. ఆనంద్‌కుమార్‌గౌడ్‌తో పాటు పలువురు నాయకులు పాల్గొన్నారు.

ముగిసిన శాస్త్రీయ సంగీత నృత్య పోటీలు



సుల్తాన్‌బజార్: నవ్య నాటక సమితి నిర్వహణలో వారం రోజులుగా తెలంగాణ సారస్వత పరిషత్‌లో జరిగిన 48వ జాతీయ స్థాయి శాస్త్రీయ సంగీత నృత్య పోటీలు శుక్రవారం రాత్రి ముగిశాయి. ప్రముఖ సంగీత విద్వాంసులు డాక్టర్ ఆడేపల్లి లోకనాథశర్మ ముఖ్యఅతిథిగా హాజరై ప్రముఖ భరతనాట్య గురువులు శీలా ఉన్ని కృష్ణన్, రతీష్ బాబు, సంజయ్, శాంతిరామ్, కళారత్న మాధవి మాలలను సత్కరించారు. భారతీయ శాస్త్రీయ సంగీత నృత్యాలకు గురు శిష్యుల పరంపర ఎంతో ముఖ్యమైందన్నారు. ఈ కార్యక్రమంలో చలపతి శాస్త్రి, లక్ష్మీమానస, మధుమతి, హేమరాజు విజయ్‌కుమార్ పాల్గొన్నారు.

శ్రీరామ్‌కు సత్కారం



గన్‌ఫౌండ్రీ: అఖిలభారత స్టేట్‌బ్యాంక్ ఆఫ్ ఇండియా సీనియర్ వైస్ ప్రెసిడెంట్‌గా ఆర్.శ్రీరామ్ ఎన్నికయ్యారు. శుక్రవారం గన్‌ఫౌండ్రీలోని స్టేట్ బ్యాంక్ ఆఫ్ ఇండియా హైదరాబాద్ సర్కిల్ యూనియన్ కార్యాలయంలో కార్యాలయ ఉద్యోగులు ఆయనను సన్మానించారు. ఈ సందర్భంగా ఓబీసీ ఆర్గనైజేషన్ ఉపాధ్యక్షుడు నందన్ మాట్లాడుతూ.. ఉద్యోగుల సాదక బాదకాలు తెలుసుకుని వారి హక్కుల కోసం నిరంతరం పోరాడే వ్యక్తికి పదవి రావడం ఎంతో ఆనందంగా ఉందన్నారు. ఏజీఎస్ వెంకటేశ్వర్లు, సుమన్, కోశాధికారి ప్రవీణ్, ఆర్ఎస్.చిన్నప్పరెడ్డి, నర్సింహ, మహేష్ పాల్గొన్నారు.

ఎన్‌హెచ్‌ఎం ఉద్యోగులను రెగ్యులర్ చేయాలి

సుల్తాన్‌బజార్: ఏఐటీయూసీ ఆధ్వర్యంలో ఎన్‌హెచ్‌ఎంలో పనిచేస్తున్న అకౌంటెంట్స్ డీఈఓ ఉద్యోగులను రెగ్యులర్ చేయాలని కోఠి డీఎంహెచ్‌ఎస్ క్యాంపస్ ఆవరణలో ధర్నా నిర్వహించారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ.. ఎన్‌హెచ్‌ఎం ఉద్యోగులను రెగ్యులర్ చేయాలన్నారు. సమాన పనికి సమాన వేతనం ఇవ్వాలని డిమాండ్ చేశారు. ఉద్యోగులకు హెల్త్ కార్డులు జారీ చేయాలని ప్రభుత్వాన్ని కోరారు. డిమాండ్లు నెరవేరే వరకు సమ్మె కొనసాగుతుందన్నారు. ఎం.నరసింహ, బాలసుబ్రహ్మణ్యం, ఉద్యోగులు తదితరులు పాల్గొన్నారు.

వంటగ్యాస్ లీకై చెలరేగిన మంటలు

అబిడ్స్: ఓ టీకొట్టు యజమాని ఇంట్లో వంట గ్యాస్ లీకై మంటలు చెలరేగాయి. ఎవరికీ ఎలాంటి ప్రమాదం చోటు చేసుకోలేదు. ఈ ఘటన షాహినాయత్‌గంజ్ పోలీస్‌స్టేషన్ పరిధిలోని గోషామహల్ ఆర్య సమాజ్ సమీపంలో ఓ ఇంట్లో చోటు చేసుకుంది. ఇన్‌స్పెక్టర్ రవీందర్ తెలిపిన వివరాల ప్రకారం.. బీహార్‌కు చెందిన పంకజ్ టీకొట్టు నిర్వహిస్తున్నాడు. శుక్రవారం రాత్రి 8 గంటల సమయంలో భార్యతో కలిసి పంకజ్ వంట చేస్తుండగా ప్రమాదవశాత్తు వంటగ్యాస్ లీకై మంటలు చెలరేగాయి. ఎస్ఐ. లక్ష్మయ్య ప్రమాద స్థలానికి చేరుకుని ఫైర్ ఇంజన్‌తో మంటలను ఆర్పించారు. ఎలాంటి ఆస్తి నష్టం జరగలేదని పోలీసులు తెలిపారు.

రెండు గ్రూపుల మధ్య గొడవ.. కేసు నమోదు

గౌలిపురా: రెండు గ్రూపుల యువకుల మధ్య జరిగిన గొడవపై పోలీసులు కేసు నమోదు చేసుకొని దర్యాప్తు చేస్తున్నారు. పోలీసుల వివరాల ప్రకారం.. భవానీనగర్‌కు చెందిన సికిందర్ (23), సయ్యద్ షాబాజ్ (23), మహ్మద్ నూర్ (20)తో పాటు మరో గ్రూప్‌కు చెందిన యూసుఫ్ ఆలియాస్ అద్నాన్ (18), మహ్మద్ అబ్దుల్ సోహెల్ (20), మహ్మద్ ఆర్బాజ్ (18), షేక్ సోహెబ్ (17), మహమ్మద్ అఖిల్ (18) గత నెల 31న రాత్రి 8.30 గంటలకు నషేమాన్‌నగర్‌లోని చాచా గ్యారేజీ వద్ద బైక్‌ను అతి వేగంగా నడపడంలో రెండు గ్రూపులు గొడవ పడ్డారు. అనంతరం రాత్రి 10 గంటల సమయంలో రెండు గ్రూపులు రాజీ కుదుర్చుకున్నారు. దీనిపై మొఘల్‌పురా పోలీసులు కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నారు.